క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

మల్హర్: మండలంలోని తాడిచర్ల పీఏసీఎస్(సహకార సంఘం) కార్యాలయంలో నేడు (సోమవారం) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైర్మన్ ఇప్ప మొండయ్య అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే సమావేశానికి పాలకవర్గ సభ్యులు, రైతులు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం రాచపల్లి గ్రామానికి చెందిన సోర్లం చక్రి ద్విచక్రవాహనంపై వెంకటాపురం మండల కేంద్రం నుంచి వాజేడు మండలం వైపు వెళ్తున్నాడు. కాగా చిరుతపల్లి గ్రామ సమీపంలో వాహనం వేగాన్ని అదుపు చేయలేక పల్టీ కొట్టడంతో చక్రికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తిని 108లో వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాకు తరలించారు.

యువకుడికి..



మండల పరిధిలోని ఆలుబాక, అబ్బాయిగూడెం గ్రామాల మధ్యలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆలుబాక గ్రామానికి చెందిన సాయి చైతన్య అనే యువకుడు ద్విచక్ర వాహనంపై అబ్బాయిగూడెం గ్రామానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆలుబాక గ్రామ సమీపంలో వాహనం వేగాన్ని అదుపు చేయలేక పల్టీ కొట్టడంతో సాయి చైతన్యకు తలకు తీవ్ర గాయాలైయ్యాయి. గమనించిన గ్రామస్తులు 108లో యువకుడిని వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ములుగు ఏరియా వైద్యశాలకు రిఫర్ చేశారు.

ఇసుక లారీ ఢీకొని వ్యక్తికి..




వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఇసుక లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం(కె) మండల పరిధిలోని బర్లగూడెం గ్రామానికి చెందిన తాటి శ్రీరామ్మూర్తి వాజేడు మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ప్రగళ్లపల్లి గ్రామం వద్దకు రాగానే వెంకటాపురం మండలం వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ బస్సును క్రాస్ చేసే క్రమంలో శ్రీరామ్మూర్తిని ఢీకొట్టింది. అతడికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం ప్రభుత్వ వైద్య శాలకు వైద్యం నిమిత్తం తరలించారు. కాగా తాటి శ్రీరామ్మూర్తిని ఇసుక లారీ ఢీకొన్న విషయం తెలుసుకున్న బర్లగూడెం గ్రామానికి చెందిన బంధువులు ప్రమాద ప్రదేశానికి వచ్చి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి ఆందోళన కారులను సముదాయించారు.

కళాకారులను ఆదుకోవాలి

గీసుకొండ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని తమ ఆట, పాటల ద్వారా ముందుకు తీసుకుని వెళ్ళిన కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకురాలు ఎర్రాల స్వప్న కోరారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ సర్కారు 550 మంది కళాకారులకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చిందని, టీపీసీసీ ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలివ్వాలని ఆమె విన్నవించారు

గుట్కా ప్యాకెట్ల పట్టివేత



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలిలో కంచి కరుణాసాగర్ నిల్వ చేసిన రూ.72,100 విలువైన గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ వివరాలు వెల్లడించారు. కరుణాసాగర్ అమ్మకానికి ప్రయత్నిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

నష్టాల్లో మిర్చి రైతులు



కల్లంలో ఆరబోసిన మిర్చి

- తెగుళ్లతో పెరిగిన పెట్టుబడి, తగ్గిన దిగుబడి
- మద్దతు ధర లేక రైతుల విలవిల

వెంకటాపురం(కె): మిర్చి పంటకు తెగుళ్లు సోకడంతో ఈ సంవత్సరం ఆశించిన మేర దిగుబడి రాలేదు. దినికి తోడు మద్దతు ధర లేక పోవటంతో పెట్టుబడి కూడా రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ సంవత్సరం దాదాపు రెండు వేల ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగు చేశారు. గత సంవత్సరం మిర్చి పంటకు క్వింటాకు రూ.22 వేల వరకు ధర ఉండడంతో ఈ సారి మిర్చి సాగు విస్తీర్ణం పెరిగింది. తీరా పంట చేతికి వచ్చే సమయంలో ధర లేక పోవంటతో రైతుల్లో ఆందోళన నెలకోంది. సాగు సమయంలో క్వింటా మిర్చి ధర రూ.15 వేల నుంచి రూ.17 వేల వరకు ధర పలకడంతో రైతులు మురిసిపోయారు. దిగుబడి ప్రారంభమైనప్పటి నుంచి ధర తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.12 వేల వరకు పలుకుంతోంది. దీంతో స్థానిక వ్యాపారులు రూ.9 వేల నుంచి రూ.10 వేలకు కొనుగోలు చేస్తున్నారు.

పెరిగిన వ్యయం

మిర్చి పంట కాతకు వచ్చే సమయానికి తెగుళ్లు ఆశించడంతో పలుమార్లు పురుగుమందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. సంబంధిత శాఖ అధికారులు రైతులకు పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించక పోవడంతో రైతులు పురుగు మందులు పిచికారీ చేయడంతో పెట్టుబడి వ్యయం భారీగా పెరిగి పోయింది. దుక్కి దున్నడం, ఎరువులు, పైమందులు, తదితర పనులకు ఎకరానికి సుమారు రూ.లక్ష యాభై వేల వరకు పెట్టుబడి అయిందని రైతులు తెలుపుతున్నారు. మిర్చి కోతల సమయంలో కూలీలు దొరకడం లేదని వస్తున్న కూలీలకు రూ.400 చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. మిర్చి ధర పెరిగితేనే పెట్టిన పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

స్థానికంగా మార్కెట్ సౌకర్యం కరువు

స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. మార్కెట్ సౌకర్యం 140 కిలో మీటర్ల దూరంలో ఉన్న వరంగల్ మార్కెట్‌కు లేదా 230 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఖమ్మం మార్కెట్‌కు లేదా ఆంధ్రలో ఉన్న గుంటూరు మార్కెట్‌కు రైతులు తమ మిర్చి పంటను తరలించి విక్రయాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు ప్రస్తుతం ఉన్న మిర్చి రేటుకు అంత దూరం మిర్చి పంటను తరలించలేక స్థానికంగా తక్కువ ధరకు దళారులకు విక్రయించి ఆర్థికంగా నష్ట పోతున్నారు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి పెరిగింది..



నేను ఆరు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. ఈ సంవత్సరం మిర్చి పంటకు తెగుళ్ల సోకడంతో ఎక్కువ మొత్తంలో మందులు కొట్టాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. అలాగే మిర్చి కోతకు కూలీలకు గతంలో రూ.300లు ఉండగా ప్రస్తుతం రూ.400 చెల్లించాల్సి వస్తోంది. దినికి తోడు మిర్చి ధర లేక తగ్గడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

- కొప్పుల కృష్ణ, రైతు

కూలీలు దొరకడం లేదు..



నేను నాలుగు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. రూ.లక్షల పెట్టుబడి పెట్టి ఎంతో కష్టపడి సాగు చేస్తే పంట చేతికి అందే సమయంలో కూలీలు దొరకడం లేదు. దీంతో కూలీల రేట్లు పెరిగిపోయాయి. పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదో అని అనిపిస్తుంది.

- కోటేశ్వర్‌రావు, రైతు

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



రేగొండ: ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సత్యనారాయణరావు



కాళేశ్వరం: ఇఫ్తార్ విందులో నాయకులు, ముస్లింలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని భాగిర్థిపేట మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని మతాలు ఒకటేనని ప్రజలంతా సోదర భావంతో ఉండాలన్నారు. మజీద్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నాయినేని సంపత్‌రావు, పున్నం రవి, పట్టెం శంకర్, షాబీర్ అలీ, మైస భిక్షపతి, క్రాంతి, ముదురుకొల్ల తరుణ్, పున్నం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని జామా మసీదులో కాంగ్రెస్‌పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు ఆధ్వర్యంలో ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. అంతకు ముందు ముస్లింలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలను శాలువాలతో సన్మానించారు. సమద్, షేక్ జానీ, ఇక్బాల్, మక్బూద్,అమీన్, శకీల్‌లతో పాటు నాయకులు పవన్‌శర్మ, మంగాయి లక్ష్మణ్, శంకరయ్య, ఫరీద్, హైదర్, అరుణ్, సంతోష్, సంతు, రాజబాపు,నగేష్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

జాతరను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎరుకల సంఘం నాయకులు

కాళేశ్వరం: ములుగు జిల్లాలోని రామంజపురంలో త్వరలో నిర్వహించనున్న నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలని ఆదివాసీ ఎరుకల సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కేతిరి సుభాష్, ఉపాధ్యక్షుడు దుగ్యాల రాములు అన్నారు. మహదేవపూర్ మండలంలో ఎరుకల ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జాతరకు ఎరుకలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎరుకల నాయకులు సుల్తాన్ సుధాకర్, సుల్తాన్ సారయ్య, శ్రీరామ రమేష్, సుల్తాన్ లడ్డు, దుద్యాల పోషం, సుల్తాన్ తిరుపతి, సుల్తాన్ పున్నం, సుల్తాన్ ప్రభాకర్, కేతుర్ రాకేష్‌లు పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే సర్టిఫికెట్లు!

'రాజీవ్ యువ వికాసం'కి కులం, ఆదాయం అవసరం

- రెవెన్యూ కార్యాలయాల్లో పెరిగిన దరఖాస్తులు
- ఇదే అదనుగా దళారుల దోపిడీ



కొత్తపల్లిగోరి తహసీల్దార్ కార్యాలయం

రేగొండ: తహసీల్దార్ కార్యాలయాల్లో డబ్బులిస్తేనే కులం ఆదాయం సర్టిఫికెట్లు వస్తున్నాయని మండలంలోని పలువురు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా రూ.4 లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణాలను అందజేస్తామని ప్రకటించింది. దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం. అలాగే ఆదాయ ధ్రువీకరణ పత్రం తాజాగా పొందాలనే నిబంధనతో ఆశావాహులు వాటి కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో మండల వ్యాప్తంగా మీసేవ కేంద్రాలన్నీ కిటకిటలాడుతున్నాయి. రెవెన్యూ కార్యాలయాల నుంచి ఆ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉండటంతో దరఖాస్తుదారులంతా తహసీల్దార్ కార్యాలయాలకు పరుగుపెడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయాలల్లో సాధారణ సమయంలో రోజుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం 50 వరకు దరఖాస్తులు అందేవని, ప్రస్తుతం వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని అధికారులు తెలుపుతున్నారు. కుప్పలు తెప్పలుగా అందుతున్న దరఖాస్తుల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తుండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా వివరాల నమోదులో జాప్యం అవుతుందని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు.

పలువురు అధికారులే దళారులుగా..

ప్రభుత్వ సాయం కోసం చేసే దరఖాస్తుకు రెవెన్యూ సర్టిఫికెట్లు అవసరముండటంతో ఇదే అదునుగా కొంత మంది అధికారులు దళారుల అవతారమెత్తుతున్నారు. అమాయకుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. రెండు రోజుల్లో ఇస్తామని చెబుతూ ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. చేసేది ఏమి లేక కొంతమంది వారు అడిగినంత ముట్ట చెబుతున్నారు. డబ్బులు ఇచ్చిన వారికి ఒక రోజులోనే సర్టిఫికెట్ అందజేస్తున్నారు. ఈ క్రమంలో సామాన్యులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. సర్వర్ బిజీ, నెట్ రావడం లేదంటూ రోజుల తరబడి వారి సర్టిఫికెట్లను పెండింగ్‌లోనే ఉంచుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పలువురు అధికారులు చేపడుతున్న అవినీతిని కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

- ఎస్సై దానరి సుధాకర్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై సుధాకర్

టేకుమట్ల: ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై దానరి సుధాకర్ అన్నారు. మండలంలోని గర్మిళ్లపల్లిలో రమేశ్ వైండింగ్‌వర్క్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా దాసారపు రమేశ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్సై దానరి సుధాకర్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లబెల్లి రవీందర్, మాజీ ఎంపీటీసీ లచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా శానిటేషన్ వాహనం



నిరుపయోగంగా ఉన్న శానిటేషన్ వాహనం

పరకాల : లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన శానిటేషన్ వాహనం మర మరమ్మతుకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. రెండేళ్ల క్రితం రూ.85 లక్షలతో కొనుగోలు చేసిన వాహనం మూడు నెలల క్రితం రిపేరుకు వచ్చింది. మున్సిపల్ వద్ద ఎలాంటి నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేయించలేదు. దీంతో ప్రధాన రహదారులపై చెత్త, చెదారం పేరుకపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు రోడ్లపై పేరుకపోయిన దుమ్ము వాహనదారుల కళ్లలో పడుతూ తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు మున్సిపల్ శానిటేషన్ వాహనానికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

గోపికృష్ణకు సన్మానం



గోపికృష్ణను సన్మానిస్తున్న అశోక్

చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన వెల్ది గోపికృష్ణ గ్రూప్–1 ఫలితాల్లో 70వ ర్యాంక్ సాధించాడు. దీంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ గోపికృష్ణను ఆదివారం శాలువాతో సత్కరించారు. రవి, అందే కుమార్‌లు పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు



ఏటూరునాగారం: పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ



ఏటూరునాగారం: ఏఎస్పీ శివం ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న ఆలయ అర్చకుడు



ములుగు రూరల్: బీజేపీ కార్యాయలంలో..



వెంకటాపురం(కె): పంచాంగ శ్రవణానికి హాజరైన గ్రామస్తులు

ములుగు రూరల్: మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడిని తయారు చేసుకొని కుటుంబసమేతంగా పండుగ చేసుకున్నారు. ఆలయాల్లో వేదపండితులు నూతన సంవత్సర పంచాంగాన్ని చదివి వినిపించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు ఉగాది వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బలరాం ఆధ్వర్యంలో శివాలయం పూజారి శివాచార్యులు పంచాంగాన్ని చదివి వినిపించారు.

వాజేడు: మండలంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో ఉగాది పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు దేవాలయాలకు వెళ్లి పూజలు చేసుకోవడంతో రద్దీ పెరిగింది. ఇళ్లల్లో పిండి వంటలను చేసుకోవడంతో పాటు సహపంక్తి భోజనాలను చేసి ఆనందంగా గడిపారు.

ఐదురోజుల ఉగాది

విశ్వకర్మలు ఐదురోజుల ఉగాది పండుగను మడిబట్టలతో ప్రారభించారు. ఉదయం నాలుగు గంటల నుంచే పండుగ సంబరాలను చేపట్టారు. ఇంట్లో పెరుమాల్లు(పందిరి)ని కంక పుల్లలతో వేసి, మోదుగ పూలు, మామిడాకు తోరనాలను కట్టారు. తమ కుల వృత్తికి సంబంధించిన పని ముట్లను పూజలో ఉంచారు.

ఏటూరునాగారం: మండలంలోని ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పాల్గొని పూజలు చేశారు.

వెంకటాపురం(కె): మండలంలో ఉగాదిని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా కొందరు రైతులు ఏరువాక సాగారు. ఇంట్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉగాది పచ్చడ తయారు చేశారు. సాయంత్రం మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయంలో పండితులు పంచాంగ శ్రవణం చేశారు.

రేగొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా మండల ప్రజలు ఉగాది పచ్చడితో పాటు బక్షాలు చేసుకుని పండుగను ప్రత్యేకంగా చేసుకున్నారు. అలాగే పురోహితులచే శ్రవణ పంచాంగాన్ని విన్నారు.

కోటంచలో..

మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు ఉగాది పర్వదినం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అర్చకులు బుచ్చమచార్యులు, శ్రీనాధచార్యులు భక్తులకు శ్రవణ పంచాంగాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఆలయ సిబ్బంది రవిందర్, శ్రావణ్, సుధాకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారు జామునే లేచి సాన్నాలు ఆచరించి, పూజలు నిర్వహించారు. తాడిచర్ల స్థానిక వెంకటేశ్వర ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కుటుంబ సభ్యులందరూ కలసి ఆరు రుచులతో కలిగిన ఉగాది పచ్చడి సేవించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం సమయంలో వెంకటేశ్వర ఆలయ పూజారి పంచాంగ శ్రవణం గావించారు.

మొగుళ్లపల్లి/టేకుమట్ల: మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో ఉగాది నూతన పంచాంగాన్ని పురోహితులు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలతో పాటు, నాయకులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఉగాది పచ్చడి చేసి తాగారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పాడిపంటలు పండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర లక్ష్మన్ నాయకులు గుర్రపు తిరుపతి గౌడ్, దర్శనం, ఉయ్యాల రమేష్, పెరుమాండ్ల రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు మాట్లాడుతూ.. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి అమృత పానియం లాంటిదని, ఆరోగ్యానికి మేలు చేస్తుందనే నమ్మకంతో ఉగాది పచ్చడి సేవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు ఆరెందల అంకన్న,శంకర్ సింగ్,విక్రమ్ సింగ్ పాల్గొన్నారు.



వాజేడులో పూజ చేస్తున్న విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులు



వాజేడు: ముత్యాలమ్మ గుడి వద్ద భక్తుల పూజలు



కోటంచలో..

రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ బోనాలు



పోచమ్మ ఆలయం వద్ద భక్తులు

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు మండలంలోని కుందనపల్లిలో ఉగాది సందర్భంగా పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ బోనాలు భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం పోషమ్మ గుడిలో చిలకలను కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.